క్లుప్తంగా

పట్నాపూర్‌కు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

బోథ్: మండలంలోని పట్నాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు ఎంపీ గోడం నగేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎన్‌పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. దీనికి స్పందించి సబ్‌స్టేషన్‌కు రూ.2.97 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్నాపూర్ గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు.

అధికారాన్ని అణగారిన వర్గాలకు అందజేస్తాం



రథయాత్రలో భాగంగా గిమ్మలో విశారదన్ మహరాజ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): అణగారిన వర్గాలకు రాష్ట్ర అధికారాన్ని అందజేస్తామని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ అన్నారు. ఆయన చేపట్టిన మాభూమి రథయాత్ర మంగళవారం రెండో రోజు భోరజ్ మండలం గిమ్మ గ్రామానికి చేరుకున్న సందర్భంగా మాట్లాడారు. అసెంబ్లీలోకి సబ్బండకులాలు పోవద్దా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఓట్లు వేసే బానిసలుగా మార్చారని, 10 శాతం కూడా లేని అగ్రవర్ణాలే అధికారాన్ని అనుభవిస్తున్నాయన్నారు. వారి రాజ్యాన్ని దింపేందుకు లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర చేపట్టినట్లుగా పేర్కొన్నారు. ఈ యాత్రకు గిమ్మ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై డప్పులు బాజాలతో ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఇన్‌చార్జి అన్నెల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు గణేశ్, జైనథ్ మండల అధ్యక్షుడు గంగన్న, గాజుల సన్ని, కోలా పరమేశ్ రాజు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని అక్కడి కాలనీవాసుల విన్నపం మేరకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ, పంచాయతీ ఈవోలకు సూచించారు. మండలంలో తాగునీటి సమస్య ఉంటే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఏఈ, మేజర్ పంచాయతీ ఈవో, కార్యదర్శులు పాల్గొన్నారు.

పీపీలకు సన్మానం



పీపీ రమణారెడ్డిని సన్మానిస్తున్న మౌనిష్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆయా కోర్టులలో నియమితులైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)లను సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి సన్మానించారు. మంగళవారం వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పీపీలు రమణారెడ్డి, రహీమ్, ప్రవీణ్ కుమార్‌లను శాలువతో సత్కరించారు. ప్రజలకు న్యాయం అందేలా చూడాలని కోరారు. ఆయన వెంట అశన్నయాదవ్, సాగర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

ఆదిలాబాద్‌టౌన్: మైనార్టీ అభ్యున్నతితోపాటు సామాజిక కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని జమాతే ఉల్మాయె హింద్ అధ్యక్షుడు హాఫిజ్ అబుబకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సేవలో ప్రతిఒక్కరూ ముందుండాలన్నారు. మంజూర్, అస్లమ్, షేక్ రిజ్వాన్, అహ్మద్, ఫైజాన్ పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: గాదిగూడ మండలంలోని కొలామ గ్రామానికి చెందిన గర్భిణి కమల బాయి రక్తహీనతతో బాధపడుతుంది. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేరగా వైద్యురాలు సుమన రక్తం అవసరం ఉందని సూచించారు. ఏబీ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా, సోమవారం రాత్రి సమయంలో అత్యవసరంగా శ్రీ హంసవాహిని వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు శివప్రసాద్ రక్తదానం చేసి ఉదారత చాటారు.

జోరుగా గంజాయి సాగు

- ఆదిలాబాద్ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- జిల్లా, మండల కేంద్రాల్లో సైతం విక్రయాలు
- పెడదారిన పడుతున్న యువత



నేరడిగొండ మండలం లింగట్లలో గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు (ఫైల్)

ఇచ్చోడ: గంజాయిపై నిషేధం ఉన్నా జిల్లాలో సాగు మాత్రం ఆగడం లేదు. జిల్లాలోని పలు మండలాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత గంజాయి సాగు చేస్తున్నారు. జిల్లా, మండల కేంద్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు సైతం ప్యాకెట్ల రూపంలో దొడ్డిదారిన తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ శాఖ మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో గంజాయి సాగుకు అడ్డులేకుండా పోతోంది. జిల్లాలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ సాగైన గంజాయి పెద్ద మొత్తంలో ఇతర ప్రాంతాలకు తరలివెళ్తోంది.

మారుమూల గ్రామాల్లో సాగు

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో గంజాయి జోరుగా సాగవుతోంది. గంజాయి స్మగ్లర్లపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా సాగుమాత్రం ఆగడం లేదు. జిల్లాలో అత్యధికంగా నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండ, గాదిగూడ, ఇంద్రవెల్లి, తలమడుగు, భీంపూర్, బోథ్ మండలాల్లోని మారుమూల గ్రామాల్లో గంజాయి సాగవుతున్నట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతాల్లో రహస్యంగా గంజాయిని సాగు చేస్తూ దళారుల ద్వారా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

జిల్లా, మండల కేంద్రాల్లో సైతం..

గంజాయి సాగుదారుల నుంచి కొనుగోలు చేసిన గంజాయిని కొంతమంది ఏజెంట్లు చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో తయారుచేసి జిల్లా, మండల కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌కు రూ.100 నుంచి రూ.200లకు అమ్ముతున్నట్లు సమాచారం. ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేసిన గంజాయిని యువత రహస్య ప్రాంతాల్లోకి వెళ్లి సిగరెట్లలో నింపుకుని దమ్ము కొడుతున్నట్లు తెలుస్తోంది.

ఎక్సైజ్ శాఖకు పట్టింపు కరువు

గంజాయి సాగును నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు గ్రామాల్లో పర్యటించి గంజాయి సాగు నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. మద్యం, బెల్ట్, కల్లు దుకాణాలతోనే సరిపెట్టుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని సంఘటనలు..

- జనవరి 1న నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని పోచంపాడ్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో నేరడిగొండ మండలంలోని లింగట్లకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- జనవరి 3న ఇచ్చోడ మండలంలోని దూబార్‌పేట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో సిరికొండ మండలంలోని సోన్‌పెల్లి గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- జనవరి 28న ఆదిలాబాద్ జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడిన 356 కిలోల గంజాయిని నిజామాబాద్ జిల్లాలోని జాక్రన్‌పల్లి మెడికేర్ ఎలక్ట్రికల్ సర్వీస్ సెంటర్‌లో ధ్వంసం చేశారు.
- మార్చి 3న జిల్లా కేంద్రంలో గంజాయి తరలిస్తున్న మహాలక్ష్మివాడకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.
- మార్చి 24న నేరడిగొండ మండలంలోని కొర్టికల్ గ్రామ శివారులో వ్యవసాయ భూమిలో రైతు అంతర పంటగా గంజాయి సాగు చేస్తుండగా నేరడిగొండ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.
- ఏప్రిల్ 4న నేరడిగొండ మండలంలోని వాకిండి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నిర్మల్‌కు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.
- ఏప్రిల్ 6న ఉట్నూర్ మండలంలోని రాములుగూడెంలో రైతు సాగు చేస్తున్న 20 గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు.
- ఏప్రిల్ 8న ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేటలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల వద్దనుంచి 4.900 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పీడీయాక్టు నమోదు చేస్తాం



గంజాయి సాగు చేసిన వ్యక్తులపై పీడీయాక్టు కేసులు నమోదు చేస్తాం. అలాంటి వారికి రైతుభరోసా లాంటి పథకాలు కూడా నిలిపివేసేలా చర్యలు తీసుకుంటాం. గంజాయి సాగు చేస్తున్న వారి వివరాలను పోలీసులకు అందించి తమవంతు బాధ్యతను నిర్వర్తించాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ, ఆదిలాబాద్

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఇచ్చోడ: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని డీటీసీఓ డాక్టర్ సుమలత అన్నారు. మండలంలోని కామగిరి, బోరిగాం, ఇచ్చోడ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. పోషణ పక్షంలో భాగంగా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించారు. కూరగాయలు, పప్పులు, పండ్లు, బెల్లం, గుడ్లు తదితర వాటిపై వివరించాలన్నారు. అంతకు ముందు ఇచ్చోడ పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రక్తహీనత కేసులు తగ్గించేలా చూడాలని ఆదేశించారు. ఇచ్చోడ డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సుమలత

ఇంద్రవెల్లి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో ఉమాదేవి పేర్కొన్నారు. మండలంలోని గట్టెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషన్ అభియాన్ పక్షం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులతోపాటు బాలింతలు, పిల్లల సంరక్షణ తదితరాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆత్రం తనుశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాదిగూడ మండలం పరిధిలోని బొజ్జుగూడ, రూపాపూర్, పర్సవాడ, ఇంద్రవెల్లి మండల పరిధిలోని మామిడిగూడ(బి), మామిడిగూడ(జీ) గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. భూగర్భ జలాలు ఎండిపోయి చేతిపంపుల్లో నీరు రాకపోవడంతో ఇతరుల వ్యవసాయ బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. మిషన్ భగీరథ నీరు రెండు బిందెల వరకు రావడం లేదన్నారు. ఆయా గ్రామాల్లో జియాలజిస్టుల ద్వారా సర్వే చేయించి బోర్లు వేయాలన్నారు. అదే విధంగా ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని గూడల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని పీవోను కోరారు. ఆయన వెంట నాయకులు కోట్నాక్ సక్కు, గ్రామస్తులు పంద్ర నగేశ్, పంద్ర లచ్చు, కోట్నాక్ లింగు, నగేశ్, కుమ్ర విలాస్ ఉన్నారు.



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

పైప్‌లైన్ పనులు ప్రారంభం

ఇంద్రవెల్లి: మండలంలోని సమాక పంచాయతీ పరిధి పాటగూడ(కే) గ్రామంలో పైప్‌లైన్ నిర్మాణ పనులను ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటగూడ(కే) గ్రామానికి శాశ్వతంగా నీటిని సమస్య పరిష్కరించేందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కృషిచేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా పైప్‌లైన్ నిర్మాణ పనుల కోసం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.8 లక్షలు మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎండీ జహీర్, కొడప శ్రీకాంత్, నాయకులు మారుతి, మాణిక్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మంగళవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు శాలువతో సన్మానించి స్వీట్లు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన జొన్నలను ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నేరడిగొండ: బీఆర్‌ఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు



తాంసి: వేసవిలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మండలకేంద్రంలోని విద్యానగర్ కాలనీకి మూడురోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాలేదు. దీంతో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మహిళలు ఖాళీ బిందెలతో బోరు బావుల వద్ద వరుస కట్టాల్సిన పరిస్థితి. గత 15 రోజుల క్రితం అధికారులు వచ్చినా నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. బిందెలతోపాటు ఎడ్లబండ్లపై డ్రమ్ములు ఏర్పాటు చేసి దగ్గరలోని బోరు మోటార్ల ద్వారా నీటిని పట్టుకుంటున్నారు. రాత్రి సమయంలో నీటిని తెచ్చుకుంటున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

నేరడిగొండ: లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో కెరీర్ గైడెన్స్, జెండర్ అండ్ ఈక్విటి అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. పీఎంశ్రీలో భాగంగా హైదరాబాద్ నుంచి డాక్టర్ స్వప్న, సైంటిస్ట్ సీతఈ సుష్మ హాజరై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం అశోక్‌రావ్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జొన్న కోతలు ముమ్మరం

- హార్వెస్టర్లతో పంట నూర్పిడి
- ఎకరాకు రూ.4,500 నుంచి రూ.5వేలు చెల్లింపు
- కొనుగోలు పరిమితిపై రైతుల్లో ఆందోళన

తాంసి: జొన్న పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈఏడాది యాసంగి సీజన్‌లో జిల్లాలోని రైతులు జొన్న సాగుచేశారు. ప్రస్తుతం పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. గ్రామాల్లో పంట కోత పనులు జోరందుకున్నాయి. కూలీల కొరత కారణంగా హార్వెస్టర్లతో కోతలు చేపడుతున్నారు. వీటికి డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం హార్వెస్టర్‌తో ఎకరం పంట నూర్పిడి చేయిస్తే రూ.4500 నుంచి రూ.5 వేల వరకు చెల్లిస్తున్నారు. హార్వెస్టర్‌తో వేగంగా పంట నూర్పిడి చేయడంతోపాటు సులువుగా కోత పూర్తికావడంతో ఆర్థికభారమైన వీటిని ఉపయోగిస్తున్నారు.

కలిసిసొచ్చిన కాలం..

వానాకాలం సీజన్‌లో సాగుచేసిన పత్తి సరైన దిగుబడి లేక మద్దతు ధర గిట్టుబాటు రాక రైతులు నష్టపోయారు. యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా జొన్న సాగుచేశారు. పంటకు కాలం కలిసిరావడంతో పురుగు ఉధృతితోపాటు తెగుళ్ల బెడద సోకలేదు. పంట ఆశించిన మేర ఎదగడంతోపాటు రైతులకు పెట్టుబడి భారం అధికంగా పడలేదు. పలుచోట్ల భూగర్భజలాలు అడుగంటడంతో కొంత మేర పంటలకు సాగునీరందించడానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. అనుకున్న మేర సాగు నీరందించడంతో దిగుబడి అధికంగా వస్తోంది. ఎకరాకు 15 నుంచి 20కి పైగా క్వింటాళ్ల దిగుబడి రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అకాల వర్షాలు లేకపోవడంతో పంటకు నష్టం వాటిల్లలేదు.



కోత కోస్తున్న హార్వెస్టర్

జిల్లాలో 79 వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో యాసంగి సీజన్‌లో ఈ ఏడాది 79వేల ఎకరాల్లో జొన్న సాగైంది. అత్యధికంగా తాంసి, భీంపూర్, తలమడుగు, జైనథ్, బేల మండలాల్లో రైతులు సాగు చేశారు. ప్రస్తుతం పంట కోతలు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు 40 శాతం నుంచి 50 శాతం వరకు కోతలు పూర్తయినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు చేతికొచ్చిన జొన్నలను తేమశాతం తగ్గే వరకు చేలలో ఆరబెడుతున్నారు. ఎకరాకు 15 నుంచి 20కి పైగా క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిన ప్రభుత్వం ఎకరాకు 8.65 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేయాలని పరిమితి విధించింది. గతేడాది ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయగా ఈఏడాది పరిమితి పెంచాల్సింది పోయి తగ్గించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన పంటను ప్రైవేట్‌లో విక్రయిద్దామంటే తక్కువ ధర చెల్లిస్తుండటంతో నష్టపోయే పరిస్థితి ఉంది. ప్రైవేట్ మార్కెట్‌లో క్వింటాల్ రూ.2,100 నుంచి 2,400 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మరింత పంట దిగుబడి వచ్చే సమయంలో వ్యాపారులు ధర తగ్గించే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి కొనుగోలు పరిమితిని ఎకరాకు 15 క్వింటాళ్లకు పైగా పెంచాలని రైతులు కోరుతున్నారు.

నాలుగెకరాల్లో సాగు చేశా



యాసంగి సీజన్‌లో నాలుగెకరాల్లో జొన్న సాగుచేశా. రెండు రోజుల క్రితం హార్వెస్టర్ కోతను పూర్తి చేయించా. 90 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రంలో ఎకరాకు 8.65 క్వింటాల్ కొనుగోలుకు ప్రభుత్వం పరిమితి విధించింది. తాను కేవలం 34 క్వింటాళ్లను మాత్రమే మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం ఉంది. మిగతా పంటను ప్రైవేట్‌గా విక్రయిద్దామంటే ధర తక్కువగా ఉంది. నష్టపోయే అవకాశం ఉంది.

– నవనీత్‌రెడ్డి, రైతు, వడ్డాడి

కేంద్రం ఏర్పాటుకు చర్యలు

పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రానికి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో త్వరలో కేంద్రం ప్రారంభిస్తాం. ఎకరాకు 8.65 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. రైతుల నుంచి పంటను కొనుగోలు చేయనున్నాం.

– కేశవ్, పీఏసీఎస్ సీఈవో, తాంసి

ఛాత్రోపాధ్యాయుల సర్వేపై పరిశీలన

బేల: స్థానిక జెడ్పీ ఉన్నత, ఉర్దూ, పోనాల, కొబ్బాయి గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఛాత్రోపాధ్యాయులు యూడైస్‌లో నమోదైన సర్వేను ఎంఈవో కోల నర్సింలు మంగళవారం పరిశీలించారు. సంఖ్య మేరకు విద్యార్థులు ఉన్నారా, లేరా, సౌకర్యాలు తదితర అంశాలపై గుర్తించి లోటుపాట్లపై సరిచేయించారు. సీఆర్పీ వెంకన్న ఉన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి రిమాండ్

నేరడిగొండ: గంజాయి కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు నేరడిగొండలోని అంకిత్ దాబా సమీపంలో సులభ్ కాంప్లెక్స్ వెనుక భాగంలో నేరడిగొండకు చెందిన రమేశ్ గిద్దె, రోల్‌మామడకు చెందిన కుంరం దత్తును తనిఖీ చేయగా వారి వద్ద 110 గ్రాముల గంజాయి లభించింది. వారిని విచారించగా ఇస్రుగూడ గ్రామానికి చెందిన నైతం కాశీరాం వద్ద నుంచి గంజాయి తీసుకొచ్చినట్లు చెప్పారు. దీంతో కాశీరాంను తనిఖీ చేయగా అతని వద్ద 50 గ్రాముల గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.4వేల వరకు ఉంటుందని వివరించారు.

పోలీసులను కించపర్చేలా పోస్టు చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసులను కించపర్చేలా సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. రౌడీషీటర్, హత్య కేసులో నిందితుడిగా ఉన్న బంగారుగూడకు చెందిన షేక్ సలీమ్ అలియాస్ కైంచి సలీమ్‌ను ఇటీవల టూటౌన్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నోటిలో కత్తి పెట్టుకొని బైక్‌పై భయభ్రాంతులకు గురిచేయగా ఆయన్ను అరెస్టు చేశారు. ఈ విషయమై ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ సోమవారం సిర్సిల వాట్సాప్ గ్రూప్‌లో మత కల్లోలను రెచ్చగొట్టేలా వ్యవహరించిన ఈయనపై కేసు నమోదైనట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం ఇతను యుగాండ దేశంలో ఉంటూ జిల్లాలో ఘర్షణ వాతావరణం తలెత్తేలా వ్యవహరించడంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైన ఆయన పంపిన పోస్టును ఫార్వడ్ చేసినా కేసు నమోదు చేస్తామన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన షాబాజ్ ఖాన్ ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఈనెల 12న జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పార్కింగ్ చేశాడు. బస్సులో నిర్మల్‌కు వెళ్లిన ఆయన తిరిగి వచ్చి చూసేసరికి బైక్ కనిపించకుండా పోయింది. దీంతో చుట్టుపక్కల గాలించినా ఆ చూకీ లభించకపోవడంతో మంగళవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

బెల్టుషాపుపై దాడి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వడ్డెరకాలనీలో బెల్టుషాపుపై మంగళవారం దాడి నిర్వహించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. కాలనీలో బెల్టుషాపు నిర్వహిస్తున్న అలకుంట్ల రాజుపై కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు. ఆయన నుంచి 3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటివిలువ రూ.2200 వరకు ఉంటుందని వివరించారు.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధి దస్నాపూర్‌లో గల ఓ పెట్రోల్ పంపు అనుకొని ఉన్న ఓ దుకాణంలో మంగళవారం చోరీ జరిగింది. దస్నాపూర్‌లో నిందితుడు మోయిజ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. అనంతరం రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు.